క్లుప్తంగా

పుస్తకాల వితరణ



పుస్తకాలు అందజేస్తున్న దాతలు

పాల్వంచ: స్థానిక గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ చేశారు. కేటీపీఎస్ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ కె.రాధ, బొల్లేరుగూడెం ఉపాధ్యాయులు కృష్ణమోహన్‌రావు రూ.10వేల విలువ చేసే పుస్తకాలను గ్రంథాలయానికి శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కష్టపడి చదివి, ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఏరియాలో డైరెక్టర్ తనిఖీ

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్(ఆర్‌సీహెచ్‌పీ)ను డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) డి.సత్యనారాయణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. కొత్తగూడెం ఏరియాలోని ఏరియా వర్క్‌షాపు, ఆర్‌సీహెచ్‌పీలలో డైరెక్టర్ డి.సత్యనారాయణ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా యంత్రాల పనితీరు, మరమ్మతు విధానాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తి రవాణాకు ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏరియా ఇంజనీర్ రఘురామిరెడ్డి, ఏరియా వర్క్‌షాపు ఎస్‌ఈ శ్రీకాంత్, ఇంజనీర్ ఉపేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'డబుల్' లబ్ధిదారుల నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

జూలూరుపాడు: డబుల్ బెడ్‌రూం ఇళ్లు అప్పగించాలని డిమాండ్ చేస్తూ పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లా తండాలోని లబ్ధిదారులు.. శుక్రవారం ఇళ్ల ఎదుట కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం రెవెన్యూ అధికారులు లాటరీ పద్ధతిలో కేటాయించిన ఇళ్లను తక్షణమే అప్పగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాకు కేటాయించిన ఇళ్లలో ఇతరులు అక్రమంగా ఉంటున్నారని వారిని ఖాళీ చేయించాలని కోరారు.

గ్రామాల్లో ఫ్రైడే.. డ్రైడే

టేకులపల్లి: మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనుల్లో భాగంగా సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే.. డ్రైడే నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ మురుగు నీటి నిల్వలను తొలగించారు. కాలువలు, పరిసరాలను శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. రోజురోజుకు ఎండ తీవ్రత మరింత పెరుగుతున్న కారణంగా ప్రజలు బయటకు రావొద్దని, అత్యవసర పరిస్థితిలో మాత్రమే బయటకు రావాలని, వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: ప్రజాపోరు యాత్ర స్ఫూర్తితో జూన్ 4న కొత్తగూడెంలో జరగనున్న సీపీఐ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.సారయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఇల్లెందులోని పార్టీకార్యాలయంలో బహిరంగ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలను సన్నద్ధం చేసి ఉద్యమాలను ఉధృతం చేయాలని సీపీఐ నిర్ణయించిందన్నారు. వచ్చే 4న కొత్తగూడెంలో నిర్వహించతలపెట్టిన బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ప్రజలను చైతన్యం చేయాలని, భారీగా సమీకరించాలని కోరారు.

ఆక్రమణలో చింతల చెరువు

పట్టించుకోని అధికారులు

- చెరువుకు పొంచి ఉన్న ముప్పు
- నీటి పరివాహకంలో ఇష్టారీతిన నిర్మాణాలు



చింతల చెరువు కట్టకు ఆనుకొని నిర్మిస్తున్న భవనం

చుంచుపల్లి: అనుమతులు లేకుండా అక్రమంగా చేపడుతున్న భవన నిర్మాణాలతో విద్యానగర్ కాలనీలోని చింతలచెరువుకు పెను ప్రమాదం పొంచి ఉంది. అక్రమార్కుల బరితెగింపుతో చింతలచెరువు బఫర్ జోన్ రోజురోజుకూ కనుమరుగవుతోంది. చెరువు పక్కన యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత పంచాయతీ అధికారులు మాత్రం మిన్నకుండి పోతున్నారు. ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారుల అండదండలతోనే ఈ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. చింతలచెరువు చుట్టూ పరిసరాలు పూర్తి కబ్జాకు గురవుతున్నా అటు వైపు కన్నెత్తి చూసే నాథుడే కరువయ్యాడు. ఈ విషయంలో అటు ఇరిగేషన్ ఇటు పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రెండేళ్లుగా చెరువు చుట్టూ పదుల కొద్దీ పెద్దపెద్ద భవనాలు నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు జరుగుతున్నాయి. సంబంధిత పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు మాత్రం నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకోవడం తప్ప కఠినమైన చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. ఒకవేళ అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు పెట్టినా వాటిని సైతం లెక్కచేయడం లేదు అక్రమార్కులు. చెరువు బఫర్ జోన్‌ను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుండడంతో భవిష్యత్‌లో చింతలచెరువుకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గతంలో కలెక్టర్ దృష్టికి పలువురు ఈ విషయాన్ని తీసుకెళ్లడంతో నోటీసులు జారీ చేయడంతో పాటు నిర్మాణ పనులను నిలిపివేసేలా చర్యలు తీసుకున్నారు. ఆ తర్వాత కొద్ది రోజులకు షరా మామూలుగానే నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. దీనివల్ల ఆ ప్రాంతంలోని ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చెరువు అలుగు పడే సమయంలో నీరు బయటకు రాకుండా బఫర్‌జోన్‌ను అక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ చేరి జలమయంగా మారడంతో ఆ సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తగ్గిపోతున్న చెరువు విస్తీర్ణం...

చింతల చెరువుకు చెందిన బఫర్‌జోన్‌లో అక్రమ కట్టడాల వల్ల క్రమేపీ చెరువు కుంచించుకుపోతోంది. బఫర్ జోన్ అంటే నీటి పరివాహక ప్రాంతం. చెరువు, కుంట, కాలువ ఏదైనా సరే. ఆయా నీటి వనరు ప్రకారం పరివాహక ప్రాంతం ఆధారపడి ఉంటుంది. ఆయా ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టడానికి వీలుండదు. ఒకవేళ చేపట్టినా వాటిని కూల్చివేసే అధికారం గ్రామపంచాయతీ అధికారులకు ఉంటుంది. ప్రస్తుతం విద్యానగర్‌లో ఉన్న చింతల చెరువు బఫర్‌జోన్‌లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. చింతల చెరువు 14 ఎకరాలకు పైగా ఉండేది. ప్రస్తుతం కేవలం 8 ఎకరాలకు చేరుకుంది. గతంలో చెరువును అభివృద్ధి చేసి ట్యాంక్ బండ్‌గా మార్చే క్రమంలో అధికారులు హద్దులు ఏర్పాటు చేశారు. కానీ అక్రమార్కులు ఆ హద్దులు దాటి భవంతులు నిర్మించారు. గ్రామ పంచాయతీ యాక్ట్ ప్రకారం చెరువులు, కుంటలకు 10 హెక్టార్లలోపు ఉంటే 10 మీటర్ల వరకు బఫర్‌జోన్‌గా నిర్ణయిస్తారు. 10 హెక్టార్ల కంటే ఎక్కువ ఉంటే 30 మీటర్ల దూరం తర్వాత మాత్రమే కట్టడాలకు అనుమతిస్తారు. కానీ విద్యానగర్‌లోని చింతల చెరువుకు మాత్రం అధికారులు అలాంటి నిబంధనలేమీ పట్టించుకోకుండా భవనాల నిర్మాణాలకు యథేచ్ఛగా అనుమతులు మంజూరు చేస్తూనే ఉన్నారు. అలా చెరువు చుట్టూ ఒకరిని చూసి మరొకరు పెద్దపెద్ద అంతస్తులుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు.



అనుమతుల్లేని నిర్మాణాల వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

నోటీసులు ఇచ్చాం..



నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడుతున్న యజమానులకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేశాం. చింతల చెరువు పరిసరాల్లో చేపడుతున్న నిర్మాణాలకు కూడా నోటీసులు ఇచ్చి ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అనుమతులు లేని కట్టడాలపై చర్యలు తీసుకుంటాం.

– బొంతు బాబూరావు, ఈఓ, విద్యానగర్ కాలనీ

బఫర్ జోన్‌లో నిర్మాణాలపై చర్యలు



చింతల చెరువు చుట్టుపక్కల ఇళ్ల నిర్మాణం చేపడుతున్న నలుగురికి గతంలో నోటీసులు ఇచ్చి పనులు నిలిపివేశాం. మళ్లీ ఇప్పుడు కొత్తగా నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిసింది. అలాంటి వాటిని పరిశీలిస్తాం. ఎవరైనా బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటాం.

– కె.కిషోర్, ఏఈ, ఇరిగేషన్

సకాలంలో విత్తనాలు అందించండి



మాట్లాడుతున్న సురేందర్

జూలూరుపాడు: ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కందగట్ల సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జూలూరుపాడులో జరిగిన ఏఐకేఎంఎస్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ముఖ్యకార్యకర్త సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి వెన్నెముకలాంటి రైతులను ఆదుకోవడంలో పాలక ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు, పురుగు మందులు రాకుండా అరికట్టాలని కోరారు.

కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల సంయుక్త కార్యదర్శి వల్లోజి రమేష్, మడి సీతారాములు, జాటోత్ నరసింహా, కూరాకుల నరసింహారావు, గలిగె వెంకటేశ్వర్లు, కల్తి నరసింహారావు, మడి సురేష్, బచ్చల నాగేశ్వరరావు, బొర్రా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలి

ఇల్లెందు: వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ప్రణాళికాబద్ధంగా నీటిని విడుదల చేయాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ అంకుషావలీ అధికారులకు, సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఇల్లెందు మిషన్ భగీరథ కార్యాలయంలో వేసవిలో నీటి సరఫరాపై సమీక్షించారు. మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు అటు మున్సిపాల్టీ, ఇటు భగీరథ నుంచి అందించే నీరు మాత్రమే అవకాశం ఉందని, ఇతర ఏ మార్గాలూ లేనందున నీటిని వృథా చేయకుండా చూడాలని కోరారు. భగీరథ యంత్రాంగం ఈ వేసవి వరకు మున్సిపల్ నీటి సరఫరా యంత్రాంగంలో కలిసి పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. మే, జూన్ వరకు నీటిని సక్రమంగా అందిస్తే వేసవి నుంచి బయట పడినట్లేనన్నారు. కార్యక్రమంలో ఏఈ శంకర్, భగీరథ ఏఈ చిరంజీవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన

జూలూరుపాడు: బేతాళపాడు, రాచబండ్లకోయగూడెం, గొల్లగూడెం, పంతులుతండా, చీపురుగూడెం అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ నిర్మలజ్యోతి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు.

అనంతరం చీపురుగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. ఔషధ మొక్కలపై మహిళలకు అవగాహన కల్పించి ఇళ్లలో పెంచుకునే విధంగా చైతన్య పరచాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. సేవ్ వాటర్, ప్లాస్టిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మేరీ లైఫ్ యాప్‌లో జీపీఎస్ మ్యాప్ ద్వారా ఫొటోలు అప్‌లోడ్ చేసే విధానాన్ని చూపించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, విద్య, రుద్రమదేవి, రమాదేవి, మణి, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో దరఖాస్తులకు ఆహ్వానం

ఇల్లెందు: ఇల్లెందు గౌతం బుద్ధ ఐటీఐలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ దరిపల్లి కిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్య సంవత్సరం గానూ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, హెల్త్ అండ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, కటింగ్ అండ్ టైలర్ తదితర ట్రేడ్‌లలో అడ్మిషన్ల కోసం జూన్ 10 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 96420 96423 నంబరులో సంప్రదించాలని కోరారు.

జీఎంకు సన్మానం



సూర్యనారాయణను సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

కొత్తగూడెంటౌన్: రుద్రంపూర్ సివిల్ కార్యాలయంలో సివిల్ ఆఫీస్‌లో డీజీఎంగా పని చేసి జీఎంగా పదోన్నతి పొందిన సూర్యనారాయణను శుక్రవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రుద్రంపూర్ సివిల్ కార్యాలయంలోని చాంబర్‌లో సివిల్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ చెనిగరపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్ హాజరయ్యారు. కార్యక్రమంలో సివిల్ ఈఈ రాజారావు, సివిల్ సూపర్‌వైజర్లు మాటేటి శ్రీనివాస్, మత్రి శ్రీనివాస్, మల్లికార్జునరావు, నవీన్, బొబ్బల భాస్కర్, ఎజ్జాల శ్రీనివాస్, రహీమ్‌పాషా, జగదీష్, ప్రదీప్, రమేష్, కొండలు, చిట్టిబాబు, రాజా రమేష్, భానుకమల్, మోహన్, భరత్ తదితరులు పాల్గొన్నారు..

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జూలూరుపాడు: జూలూరుపాడు, పాపకొల్లు, పడమటనర్సాపురం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు జూలూరుపాడు మండల ట్రాన్స్‌కో ఏఈ ఎస్.సతీష్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాగునీటి సరఫరా..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలోని శనివారం పలు వార్డులో తాగునీటి సరఫరా బంద్ చేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జి.రఘు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైపులైన్‌కు మరమ్మతుల కారణంగా జోన్-1 లో ఉన్న 1, 26 వార్డులు, జోన్-2లో ఉన్న 16, 17, 18, 32 వార్డులు, జోన్-4లోని 6 నుంచి 12వ వార్డు వరకు నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు ప్రజలు సహకరించాలని తెలిపారు.

విజేతలకు బహుమతుల పంపిణీ



సర్టిఫికెట్లు, జ్ఞాపికలతో క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

ఇల్లెందురూరల్: మండల, మున్సిపల్ స్థాయిలో ఈ నెల 16, 17 తేదీలలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల విజేతలకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా క్రీడల కన్వీనర్, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయిలో నాణ్యమైన క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారని, వారిలో ప్రతిభ వెలికితీసే లక్ష్యంతో ప్రభుత్వం వేసవిలో సీఎం కప్ పేరుతో క్రీడా పోటీలు నిర్వహించిందని పేర్కొన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు గ్రామాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను నిరంతర సాధనకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైస్‌ఎంపీపీ ప్రమోద్‌కుమార్, ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ చిరంజీవి, పీఈటీలు పాల్గొన్నారు.

ఆదివాసీ సదస్సును విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ఆదివాసీలకు అస్థిత్వ రక్షణకై, పర్యావరణ, జీవావరణ పరిరక్షణకు మే 21న విశాఖపట్టణంలో నిర్వహిస్తున్న అఖిల భారత స్థాయి ఆదివాసీ సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని రొంపేడు, ఒడ్డుగూడెం గ్రామాలలో శుక్రవారం వాల్‌పోస్టర్లను ఆదివాసీ నాయకులు ఆవిష్కరించారు. సూర్నపాక నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తరతరాలుగా అభివృద్ధికి ఆమడదూరంగా పాలకులు ఆదివాసీలను నిలిపివేశారని, తీవ్రమైన పేదరికం, వెనకబాటుతనానికి గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ చట్టాలను నీరుగార్చి విశాలమైన అటవీ భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఆదివాసీల పట్ల పాలకుల వైఖరిని నిరసిస్తూ, ఆదివాసీల మనుగడకు ఉపయోగపడేలా చట్టాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా సదస్సు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూర్నపాక రామారావు, మోకాళ్ల వెంకటేశ్వర్లు, ఈసం సారయ్య, పొడుగు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నగదు బదిలీ పథకాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న కాసాని ఐలయ్య

సుజాతనగర్: ఎలాంటి షరతులు లేకుండా గొల్ల కురుములకు నగదు బదిలీ పథకాన్ని అమలు చేయాలని గొర్రెల, మేకల పెంపకదారుల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కాసాని ఐలయ్య డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సుజాతనగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 7 లక్షల కాపరులుండగా అందులో సగం మందికే మొదటి విడతలో గొర్రెలు పంపిణీ చేసినట్లు చెప్పారు. మిగిలిన సగం మందికి రెండో విడత నగదు బదిలీ పథకాన్ని అమలు చేయాలన్నారు. పంపిణీలో దళారుల వ్యవస్థ లేకుండా చేస్తేనే... గొల్ల కురుములకు మేలు జరుగుతుందని తెలిపారు. స్థానిక వాతావరణ పరిస్థితులను తట్టుకునే విధంగా కాపరులు గొర్రెలను తెచ్చుకుంటారని, ఎక్కడి నుంచో గొర్రెలను తెచ్చి ఇవ్వడం వలన ఇక్కడి వాతావరణానికి అవి తట్టుకోలేక మృత్యువాత పడుతున్నట్లు చెప్పారు. వర్షాకాలంలో ప్రతి గ్రామానికి పది ఎకరాల బీడు భూములు కాపరులకు చూపించాలని, ప్రమాదవశాత్తు చనిపోయిన కాపరులకు ఐదు లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి బచ్చలకూర శ్రీను, కొంపెల్లి ఐలయ్య, రాసాల హనుమంతరావు, వీర్ల ముత్తయ్య పాల్గొన్నారు.

'సీతారామ'ను రోళ్లపాడుగా మార్చండి



మాట్లాడుతున్న మధు

ఇల్లెందు: సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం సీతారామ ప్రాజెక్టును రోళ్లపాడు రిజర్వాయర్‌గా మార్చాలని, ఎత్తిపోతల ద్వారా ఏజెన్సీ ప్రాంతాలకు నీటిని సరఫరా చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఇల్లెందులోని ఎన్డీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ స్వయంగా రోళ్లపాడులో సభ నిర్వహించి సీతారామ ప్రాజెక్టుగా ప్రకటించి రోళ్లపాడులోకి నీరు మళ్లించి రిజర్వాయర్‌గా మారుస్తామని ప్రకటించినట్లు చెప్పారు. కానీ ఎనిమిదేళ్లయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. ఆంధ్రా పెట్టుబడిదారులకు ఉపయోగపడేలా యాక్షన్ ప్లాన్‌లో లేని సత్తుపల్లికి మేలు జరిగేలా ప్రాజెక్టు కాలువను మళ్లించి నీరు సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రోళ్లపాడును రిజర్వాయర్‌గా మార్చాలని, గుండాల, గంగారం మండలాలతో పాటు ఇల్లెందు నియోజకవర్గానికి ఈ ప్రాజెక్టు నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రొంపేడు వరకు కాలువలు తీసి చేతులు దులుపుకునే యత్నం చేస్తున్నారని తెలిపారు. 2016 ఫిబ్రవరి 16న సీఎం కేసీఆర్ స్వయంగా రోళ్లపాడుకు వచ్చి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఆనాడు ఈ ప్రాజెక్టు విలువ రూ.8 వేల కోట్లు కాగా, ప్రస్తుతం డిజైన్ మార్చి రూ.13,384 కోట్లుగా చేసినట్లు చెప్పారు. సమావేశంలో తుపాకుల నాగేశ్వరరావు, యాకన్న, కె.సారంగపాణి, డి.ప్రసాద్, సర్పంచ్‌లు శంకర్, రజిత, శ్రీను, పొడుగు నర్సింహారావు, కల్తీ వెంకటేశ్వర్లు, సూర్పబాక నాగేశ్వరరావు, ఎట్టి నర్సింహారావు, చిన్న స్వామి, ఎనగంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య అడుగు జాడల్లో పయనిద్దాం..



సుందరయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లెందు: సమాజంలో పేద, ధనిక తేడా ఉండరాదని, మనుషులంగా ఒక్కటేననే భావనతో సమాజం ముందుకు సాగాలని ఆశించిన మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని, ఆయన అడుగు జాడలో పయనిస్తూ సమసమాజ స్థాపనకు కృషి చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎస్‌ఏ నబీ పిలుపునిచ్చారు. శుక్రవారం ఇల్లెందులో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త బస్టాండ్ సెంటర్‌లోని సుందరయ్య స్మారక స్తూపం, సీపీఎం కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. సీపీఎం కార్యకర్తలు, నాయకులు పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, అబ్బాస్, మోహన్‌రావు, సుల్తానా, మరియా, వాసం రాము, సర్వన్, నాగరాజు, సంగెం వేణుగోపాల్, కొడెం బోస్, ధరావత్ రాందాస్, వైకుంఠం, రాజు తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్: సేవ చేయాలంటే పదవులు ఉండాల్సిన అవసరం లేదని పదవులనే పక్కన పెట్టిన మహానేత పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. శుక్రవారం సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలో ఏర్పాటు చేసిన సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. నేటి రాజకీయ నాయకులు అధికారం కోసం దిగజారి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ఈడీ, ఐటీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను ప్రతిపక్షాల మీదికి పంపి బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాసాని ఐలయ్య, అన్నవరపు కనకయ్య, ధర్మ, భూక్యా రమేష్, వీర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు



అటెన్షన్ ప్లీజ్

బాబోయ్... వానర సేన



టేకులపల్లి మండలంలో కోతులు హల్‌చల్ చేస్తున్నాయి. ఆహారం కోసం గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. దుకాణాలు, ఇళ్లల్లో దూరి అందినకాడికి ఎత్తుకెళ్తున్నాయి. అడ్డుకుంటే దాడులకు పాల్పడుతున్నాయి. మండల కేంద్రంలో పరిస్థితి మరీ దారుణం. గుంపులు గుంపులుగా ఇళ్లల్లోకి వచ్చి సామాన్లను చిందరవందర చేస్తున్నాయి. మూడేళ్ల క్రితం అడపా దడపా మండలంలో కోతులను పట్టి దూరంగా అడవిలో వదిలేసేవారు. ప్రస్తుతం ఆ ఊసే లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : కోట వీరబాబు, ఎంపీడీఓ, టేకులపల్లి
సెల్ నెంబర్: 92814 79238

బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుంది..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా



హాజరైన మహిళలు, నాయకులు

పాల్వంచరూరల్: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలిచి హ్యాట్రిక్ సాధిస్తుందని, ఎన్ని అడ్డంకులు వచ్చినా తానే కొత్తగూడెం నుంచి పోటీ చేస్తానని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఉల్వనూరు గ్రామంలో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశం జెడ్పీటీసీ బరపటివాసుదేవరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు భారీ ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వనమా మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు, నాయకులు ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. రూ.3వేల కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీకి బలం, బలగం కార్యకర్తలేనని క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సమన్వయ పరచడంకోసమే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజల మద్దతుతో 18 సంవత్సరాలు సర్పంచ్‌గా, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనట్లు తెలిపారు. తుదిశ్వాస వరకు ప్రజాసేవలోనే ఉంటానన్నారు. సమావేశంలో కంచర్ల చంద్రశేఖర్‌రావు, కొత్వాల శ్రీనివాసరావు, వనమా రాఘవేందర్‌రావు, కిలారు నాగేశ్వరరావు, మడివి సరస్వతి, మహిపతి రామలింగం, మల్లేల శ్రీరామ్మూర్తి, పూసల విశ్వనాథం, రాజ్ గౌడ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన...

రాజాపురం, యానంబైల్ గ్రామాల మధ్య కిన్నెరసాని వాగుపై రూ.10కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పనులను శుక్రవారం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ డీఈ నాగేశ్వరరావుతో మాట్లాడారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడక ఉన్నాయని అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మందెరకలపాడు గ్రామ సమీపంలోని రాళ్లవాగు ప్రాజెక్టును ఎమ్మెల్యే సందర్శించారు. ప్రాజెక్టుకు లీకేజీ సమస్య ఉందని రైతులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సమస్యను వెంటనే పరిష్కారించాలని ఎమ్మెల్యే జలవనరులశాఖ డీఈ చంద్రశేఖర్‌కు సూచించారు.